
सत्यमेव जयते
न्याय विभाग
Department of Justice
भारत सरकार
Government of India

# రాజ్యాంగ దినోత్సవం – పౌర విధులు 26 నవంబరు 2019 – 26 నవంబరు 2020



“ రాజ్యాంగం కేవలం ప్రభుత్వం మాత్రమే పాటించాల్సిన ప్రామాణిక పత్రం మాత్రమే అయినట్లయితే ప్రజాస్వామ్యం చిక్కుల్లో పడుతుంది. అందుకే అది కిందిస్థాయికి చేరాలి”


నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

## భారత రాజ్యాంగం

- భారత రాజ్యాంగం, మన దేశ ప్రాథమిక రాజకీయ నిర్మాణాన్ని రూపొందించే మౌలిక చట్టం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్రాలు, కేంద్రం కలయికతో సమాఖ్యగా నిర్మితమైన గణతంత్రాన్ని అది ఏర్పరుస్తుంది.
- మన పూర్వుల దార్శనికత, విలువలకు నిలువెత్తురూపం భారత రాజ్యాంగం. అది, సామాజిక, రాజకీయ, ఆర్థిక లక్షణాలు, విశ్వాసాలు, ఇష్టాలకు సంబంధించి వారి ఆలోచనలకు ప్రతినిధి.
- గణతంత్ర భారతంలో ప్రధాన విభాగాలైన- కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలను రాజ్యాంగం నిర్వచిస్తుంది. వాటి అధికారాలను నిర్వచించి, బాధ్యతల హద్దులను నిర్దేశిస్తుంది.
- భారత రాజ్యాంగంలోని కీలకాంశాలు:
  - పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ
  - సమాఖ్య నిర్మాణం
  - లౌకిక రాజ్యం
  - స్వతంత్ర న్యాయవ్యవస్థ
  - ప్రాథమిక హక్కులు, బాధ్యతలు
  - రాజ్య విధాన సంబంధ ఆదేశక సూత్రాలు
  - పౌరసత్వం
  - వయోజన ఓటు హక్కు
- ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన, సవివరమైన రూపం... భారత రాజ్యాంగమే. దీనిని అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, రష్యా తదితర దేశాల రాజ్యాంగాల స్ఫూర్తితో రూపొందించారు.
- రాజ్యాంగంలో 12 అనుసూచీలు, 22 భాగాలు, 395 అధికరణలు ఉన్నాయి.

“రాజ్యాంగం గురించి తేలికగా చెప్పాల్సి వస్తే - భారతదేశ ఐక్యత.. భారతీయులకు గౌరవం - ఈ రెండు మౌలిక సూత్రాలను సాకారం చేసేదే రాజ్యాంగమని నేను వివరిస్తాను.”

నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి




అందమైన దస్తూరీతో ఆంగ్లంలో లిఖించిన భారత రాజ్యాంగ మొదటి ప్రతి ముఖ పత్రమిది

రాజ్యాంగం ప్రథమ లిఖిత ప్రతి 16x 2 2 అంగుళాల కొలతలుగల వెయ్యేళ్లనాటి చర్మ పత్రాలపై రాయబడింది. ఈ సంపూర్ణ రాత ప్రతి బరువు 3.75 కిలోలు కాగా, ఇందులో మొత్తం 251 పుటలున్నాయి

# రాజ్యాంగ సభ – రాజ్యాంగం రూపకల్పన

1946 నుంచి 1949 మధ్య కాలంలో సమావేశాలు నిర్వహించిన రాజ్యాంగ సభ (1946 నాటి మంత్రిమండలి కార్యక్రమ ప్రణాళిక కింద ఏర్పడింది) భారత రాజ్యాంగం ముసాయిదాకు రూపకల్పన చేసింది. ఈ రాజ్యాంగ సభకు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షులుగా పని చేశారు.

1946-49 మధ్య మూడేళ్ళ కన్నా తక్కువ సమయంలో రాజ్యాంగ సభ రాజ్యాంగం ముసాయిదాను రూపొందించింది. అప్పటి సభలో మొత్తం సభ్యుల సంఖ్య 299 కాగా, అందులో 15 మంది మహిళలు.

రాజ్యాంగ సభ సభ్యులు 1946 డిసెంబరు నుంచి 1949 నవంబరు మధ్య కాలంలో 11 సార్లు సమావేశమయ్యారు.

ఆ తరువాత 1947 ఆగస్టు 29న రాజ్యాంగ ముసాయిదా రచన కోసం డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ అధ్యక్షతన ఒక కమిటీని రాజ్యాంగ సభ ఏర్పాటు చేసింది.



1946 డిసెంబరులో రాజ్యాంగ సభ సమావేశమైన దృశ్యం.

“గౌరవనీయులైన బాబా సాహెబ్ అంబేడ్కర్ గారి నాయకత్వంలో భారతదేశం ఒక సంఘటిత రాజ్యాంగాన్ని రచించుకుంది. ఈ సంఘటిత రాజ్యాంగమే నవభారత నిర్మాణ సంకల్పానికి మార్గదర్శి. అది మనకోసం కొన్ని విధులను నిర్దేశించడంతోపాటు మనకు కొన్ని హద్దులు కూడా గీసింది”

నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

“ రాజ్యాంగమంటే కేవలం న్యాయవాదులు రూపొందించిన పత్రం కాదు. ఇదొక జీవన వాహకం- దాని స్ఫూర్తి.. ఈ యుగ స్ఫూర్తి' ”

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటం

రాజ్యాంగ రూపకల్పన కోసం రాజ్యాంగ సభ మొత్తం 13 కమిటీలను నియమించింది. వాటిలో 8 అత్యంత ప్రధాన కమిటీలు కాగా... మిగిలినవి పరిమిత బాధ్యతలు కలిగినవి.

రాజ్యాంగ సభలోని 8 ప్రధాన కమిటీలు ఇవే:

- ముసాయిదా కమిటీ
- కేంద్ర అధికారాల కమిటీ
- కేంద్ర రాజ్యాంగ కమిటీ
- ప్రాంతీయ రాజ్యాంగ కమిటీ
- ప్రాథమిక హక్కులు, మైనారిటీలు, గిరిజన, విస్మృత ప్రాంతాలపై సలహా కమిటీ
- విధాన నియమాల కమిటీ
- రాష్ట్రాల కమిటీ
- సారథ్య కమిటీ



భారత రాజ్యాంగ ప్రతిపై సంతకాలు చేస్తున్న కేంద్ర కేబినెట్ సభ్యులు. చిత్రంలో ఉన్న వారు రాజ కుమారీ అమృత్ కౌర్, డాక్టర్ జాన్ మథాయి, సర్దార్ పటేల్

భారత రాజ్యాంగం 1949 నవంబరు 26న ఆమోదించబడి 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. అదే రోజున రాజ్యాంగ సభ భారతదేశ తాత్కాలిక పార్లమెంటుగా పరివర్తన చెంది, 1952లో కొత్త పార్లమెంటు ఏర్పాటయ్యేదాకా కొనసాగింది.రాజ్యాంగ ముసాయిదాపై చర్చ సందర్భంగా రాజ్యాంగ సభలో మొత్తం 7,635 సవరణలు ప్రవేశపెట్టగా వాటిపై కూలంకషమైన చర్చ తరువాత 2,473 సవరణలను పరిష్కరించారు.

సభలో ఉన్న మొత్తం 299మంది సభ్యులలో రాజ్యాంగంపై 284 మంది సంతకాలు చేయడం విశేషం.



1950 జనవరి 24న రాజ్యాంగ సభ తుది సమావేశంలో పాల్గొన్న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్

రాజ్యాంగ పరిషత్తు ఆమోదించినవి 1947 జూలై 22న జాతీయ పతాకం 1950 జనవరి 24న జాతీయ గీతం, జాతీయ కీర్తన.

ఆధునిక భారతీయ చిత్రకళలో ఆద్యుడైన శ్రీ నందలాల్ బోస్ రాజ్యాంగం పుటలకు అంచులను తీర్చిదిద్దడంతోపాటు వాటిని కళాకృతులతో సుందరంగా అలంకరించారు.

అందంగా చక్కని దస్తూరీ రాయడంలో నిష్ణాతుడైన శ్రీ ప్రేమ్ బిహారీ నారాయణ్ రైజాదా ఎవరి సహాయం తీసుకోకుండా తానొక్కరే మొత్తం రాజ్యాంగాన్ని చేతితో రాశారు. ఇందుకోసం ఆరు నెలలపాటు శ్రమించినప్పటికీ ఈ బృహత్కార్యం నెరవేర్చినందుకు ఆయన ఎలాంటి ప్రతిఫలం తీసుకోలేదు




1950 రాజ్యాంగ పరిషత్తు సభ్యుల బృంద ఛాయా చిత్రం

## రాజ్యాంగ సభ మరియు ముఖ్యమైన సభ్యులు

కేంద్ర మంత్రిమండలి కార్యాచరణ ప్రణాళిక సిఫారసుకు అనుగుణంగా రాజ్యాంగ సభ సభ్యులను ఆయా ప్రాంతీయ శాసనసభలు పరోక్ష ఎన్నికల ద్వారా ఎంపిక చేశాయి. తదనుగుణంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 229 మంది, రాష్ట్రాల నుంచి 70 మంది మొత్తం 299 మంది రాజ్యాంగ సభలో ప్రతినిధులుగా ఉన్నారు.

రాజ్యాంగ సభలోని ప్రముఖులలో కొందరి పేర్లు:

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్
సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్
జవహర్ లాల్ నెహ్రూ
డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
గోవింద్ వల్లభ్ పంత్
మౌలానా అబుల్ కలామ్ ఆజాద్
సరోజినీ నాయుడు
రాజ్ కుమారి అమృత్ కౌర్
జె.బి.కృపలానీ
సి.రాజగోపాలాచారి
శరత్ చంద్ర బోస్
ఆసఫ్ అలీ
శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ
హంసా మెహతా
గోపీనాథ్ బోర్డోలాయ్
హరేంద్ర కుమార్ ముఖర్జీ
వినోదానంద ఝా
దుర్గాబాయి దేశ్‌ముఖ్
ఫ్రాంక్ ఆంథోనీ
జైపాల్ సింగ్ ముండా
హరగోవింద్ పంత్
జాన్ మథయ్
బేగం ఎజాజ్ రసూల్
కె.ఎం.మున్షీ
సర్వేపల్లి రాధాకృష్ణన్
అమ్ము స్వామినాథన్
ఎం. అనంతశయనం అయ్యంగార్
అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
భోగరాజు పట్టాభి సీతారామయ్య
టంగుటూరి ప్రకాశం
నీలం సంజీవ రెడ్డి
ఎస్. నిజలింగప్ప
జి.వి. మావలంకార్
పదంపత్ సింఘానియా
పురుషోత్తం దాస్ టాండన్
సుచేత కృపలానీ
హజ్రత్ మోహానీ
రఫీ అహ్మద్ కిద్వాయ్
అనుగ్రహ నారాయణ్ సిన్హా
జగ్జీవన్ రామ్
సచ్చిదానంద సిన్హా
సత్యనారాయణ సిన్హా
శ్రీకృష్ణ సిన్హా
సేఠ్ గోవింద్ దాస్
హరి సింగ్ గౌర్
పంజాబ్‌రావ్ ఎస్. దేశ్‌ముఖ్
రవి శంకర్ శుక్లా
హరేకృష్ణ మెహతాబ్
యానీ మస్కరెనీ
జీవరాజ్ నారాయణ్ మెహతా
మోటూరి సత్యనారాయణ
దీప్ నారాయణ్ సింగ్
సర్ సయ్యద్ మొహమ్మద్ సాదుల్లా
కె. కామరాజ్
పి. సుబ్బరాయన్



I beg to move, Sir,

"That it be resolved that:

(1) After the last stroke of midnight, all members of the Constituent Assembly present on this occasion do take the following pledge:

'At this solemn moment when the people of India, through suffering and sacrifice, have secured freedom, I, ............. a member of the Constituent Assembly of India, do dedicate myself in all humility to the service of India and her people to the end that this ancient land attain her rightful place in the world and make her full and willing contribution to the promotion of world peace and the welfare of mankind.'

(2) Members who are not present on this occasion do take the pledge (with such verbal changes as the President may prescribe) at the time they next attend a session of the Assembly."

రాజ్యాంగ సభ సభ్యుడి ప్రతిజ్ఞ.

# పౌర, ప్రాథమిక విధులు

మన రాజ్యాంగ ముఖ్య లక్షణం



> "సక్రమ విధి నిర్వహణే హక్కు"
>
> మహాత్మా గాంధీ

పౌరులు, వారి ప్రాథమిక విధులపై దేశ పౌరులందరికీ మంచి అవగాహన కల్పించడానికి భారత ప్రభుత్వం ఏడాది పాటు (అంటే 26 నవంబర్ 2019 నుంచి 26 నవంబర్ 2020 వరకు) Join at #itsmyduty ప్రచారోద్యమం చేపట్టింది.

ముఖ్యోద్దేశాలు

- భారత రాజ్యాంగం, దానిలో పొందుపరచిన విలువలు, నియమాలకు నిజమైన సంరక్షకులు భారతదేశ ప్రజలేనని వారికి పునరుద్ఘాటించడం.
- దేశంపట్ల, సమాజంపట్ల, సాటి పౌరుల పట్ల తమ విధులను గురించి దేశ ప్రజలందరికీ గుర్తు చేయడం.
- జాతీయతా స్ఫూర్తిని పౌరులు గర్వంగా భావించడాన్ని ప్రోత్సహించడం.
- క్రమశిక్షణ పాటించేలా ప్రోత్సహించడం, దేశంపట్ల నిబద్ధత కలిగి ఉండడం, జాతినిర్మాణంలో పౌరుల శక్తి సామర్ధ్యాల సమీకరణకు తోడ్పాటును అందించడం.

## పౌర విధుల గురించి తెలుసుకోండి

- భారత రాజ్యాంగ పీఠికను చదవండి. ఆన్‌లైన్ ప్రతిజ్ఞ చేయండి. వెంటనే MyGov.in నుంచి ధ్రువపత్రం పొందండి
- ఆన్‌లైన్‌లో నిర్వహించే రాజ్యాంగ దినోత్సవ క్విజ్, వ్యాసరచన పోటీలలో MyGov.in వెబ్ సైటు ద్వారా పాల్గొనండి
- పోస్టర్లు, బ్రోషర్లు ఇతర ప్రచారవ్యాప్తి సామాగ్రి (అవుట్ రీచ్ మెటీరియల్)ని www.doj.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

> "దేశం పట్ల మీ కర్తవ్యాలు, విధుల గురించి ఆలోచించేలా కనీసం ఒక్క తీర్మానం అయినా చేయాలని కోరుతున్నాను. విధుల బాటలో పయనిస్తున్నప్పుడు.. 130 కోట్ల ప్రయత్నాలు, 130 కోట్ల తీర్మానాలు దేశానికి ఎంతో మేలు చేస్తాయి"
>
> నరేంద్ర మోధీ, ప్రధాన మంత్రి, స్వచ్ఛ భారత్ దివస్ నాడు, 2019

@DoJ_India and @MyGov ను అనుసరించండి, #itsmyduty లో చేరండి.

భారత రాజ్యాంగం, ప్రాథమిక విధులకు సంబంధించిన పూర్తి పాఠం కోసం http://legislativegov.in/constitution.of.india వెబ్ సైటు చూడండి

न्याय विभाग
Department of Justice
भारत सरकार
Government of India
सत्यमेव जयते

## ప్రాథమిక విధులు - వాటి ప్రాధాన్యత మరియు చేర్పు

> "నేను నా విధులను గురించి మా తల్లి ఒడి నుంచే నేర్చుకున్నాను. ఆమె నిరక్షరాస్యురాలైన గ్రామీణ మహిళ. ఆమెకు నా ధర్మం గురించి తెలుసు. ఆ విధంగా నేను నా చిన్నతనం నుంచే నా ధర్మం గురించి తెలుసుకోగలిగాను. మన ధర్మాన్ని మనం సరిగా నిర్వర్తించినట్లయితే హక్కులు వాటంతట అవే వస్తాయి. ఇందులో గొప్పతనమేమిటంటే మనం నిర్వర్తించే బాధ్యతలే మనకు హక్కు వచ్చేటట్లు చేస్తాయి. అందువల్ల బాధ్యతల నుంచి హక్కులను వేరు చేయలేము. ఆ భావన నుంచే సత్యాగ్రహ పుట్టిందట. అందుకే నేను ఎల్లప్పుడూ నా బాధ్యత ఏమిటి? అన్న దానిని నిర్ణయించడానికి ప్రయత్నిస్తూ ఉంటాను"
>
> 1947 జూన్ 28న న్యూఢిల్లీలో జరిగిన ఒక ప్రార్థనా సమావేశంలో ప్రాథమిక విదుల ప్రాధాన్యత గురించి తెలియజేస్తూ మహాత్మా గాంధీ....

మన రాజ్యాంగంలో 11 కీలకమైన ప్రాథమిక విధులను చేర్చారు. తాము పొందుతున్న సంపూర్ణమైన హక్కులకు ప్రతిగా.. పౌరులు నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని తెలియజెప్పడమే దీని ఉద్దేశం.

ప్రాథమిక విధులు ప్రధానంగా గౌరవం, అభిమానం, సహనం, శాంతి, ఎదుగుదల, సామరస్యం వంటి వాటిపై దృష్టి సారిస్తాయి.

రాజ్యాంగంలో 1976లో పొందుపరచిన రాజ్యాంగ సవరణ చట్టం ప్రాథమిక విధులలో దేశం పట్ల పౌరులు పాటించవలసిన మౌలిక, నైతిక, తప్పనిసరి విధులను గురించి పేర్కొంటుంది.

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చాలని సిఫారసు చేస్తున్న సమయంలో ఏర్పాటైన కమిటీ, పౌరులు తమ ప్రాథమిక హక్కులను వినియోగించుకునే క్రమంలో తమ బాధ్యతలను విస్మరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడింది.

పిల్లలకు విద్యావకాశాలకు సంబంధించిన 11వ ప్రాథమిక విధిని 2002లో 86 వ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగంలో చేర్చారు.

మునుపటి సోవియట్ యునియన్, జపాన్, చైనా రాజ్యాంగాల నుంచి ప్రాథమిక విధులకు సంబంధించిన స్ఫూర్తిని అందిపుచ్చుకున్నారు.

మన ప్రాథమిక విధులు భారతీయ జీవన విధానాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన సమగ్రమైన విధుల క్రోడీకరణ. ఇవి ఒక విధమైన క్రమశిక్షణను, సమాజం పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయి.

రాజ్యాంగం ప్రజలకు ప్రత్యేకంగా కొన్ని ప్రాథమిక హక్కులు దఖలు పరుస్తూనే, పౌరులు మౌలికంగా ప్రజాస్వామిక నడత, ప్రజాస్వామిక ప్రవర్తన కలిగి ఉండాలని కోరుకుంటుంది. వీటిని పదే పదే గుర్తుచేయడానికి ఉద్దేశించినవే ప్రాథమిక విధులు. ఎందుకంటే హక్కులు, బాధ్యతలు పరస్పరం విడదీయరానివి.


> "ప్రజాస్వామ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వ రూపం కాదు. మన సాటి పౌరుల పట్ల ఉండవలసిన గౌరవం, పూజ్య భావం"
>
> డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్

> "ప్రతి భారతీయుడు ఇక తాను రాజ్‌పుత్ నని, సిక్కు లేదా జాట్ ననే విషయం మరచిపోవాలి. తాను భారతీయుడిననే సంగతి తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. తన దేశంలో తనకు అన్ని హక్కులూ ఉంటాయి. వాటితో పాటు బాధ్యతలూ ఉన్నాయి"
>
> సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్

మన జాతీయ లక్ష్యాలను అందుకోవాలంటే చురుగ్గా భాగస్వాములు కావాలని తెలుసుకోవడానికి... పౌర, ప్రాథమిక విధులు ఉపకరిస్తాయి.

ప్రాథమిక విధులను దేశపౌరులకు బోధించడానికి సంబం ధించిన సూచనలపై 1999 అక్టోబర్‌లో జస్టిస్ వర్మ నేతృత్వంలోని కమిటీ నివేదిక సమర్పించింది.

## రాజ్యాంగంలోని IV-A భాగం, అధికరణం 51Aలో 11 ప్రాథమిక విధులను పొందుపరచడం జరిగింది.




మన రాజ్యాంగంలో చేర్చిన ప్రాథమిక విధులను, మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనకు సంబంధించిన అధికరణం 29 (1) తో అనుసంధానించారు.

> "ప్రపంచ పౌరసత్వానికి సంబంధించిన విధులను మనం చక్కగా నిర్వర్తించినప్పుడే కీలకమైన జీవించే హక్కు మనకు ఒనగూడుతుంది. ఈ మౌలిక ప్రకటనతో, పురుషులు, స్త్రీల బాధ్యతలు ఏమిటో నిర్వచించడం సులభం. ప్రతి హక్కును వారు నిర్వర్తించవలసిన సంబంధిత విధులతో ముడిపెట్టవచ్చు. దానివల్ల హక్కులను సాధించుకోవడానికి పోరాడాల్సిన అవసరం ఉండదు"
>
> మహాత్మాగాంధీ

### ప్రాథమిక విధులు, హక్కులు ఒకే నాణానికున్న రెండు ముఖాలు

విధులకు మూలం హక్కు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తిస్తే, హక్కుల కోసం మనం వెదుకులాడవలసిన పని ఉండదు" అని మహాత్మాగాంధీ చెప్పారు

పౌరులు తమ ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులతో జతకలిపి చూడనంత వరకు ప్రజాస్వామ్యం సమాజంలో బలంగా వేళ్లూనుకోదు

ప్రతి హక్కు వెంట సంబంధిత విధి ఉంటుంది. ఒక పౌరుడు నిర్వర్తించే బాధ్యతల వల్ల మరొకరికి హక్కులు సంక్రమిస్తాయి

మనం మన విధులను నిర్వర్తించినప్పుడే హక్కులు పొందే హక్కు లభిస్తుంది